ఏలికలు ప్రజల్ని పీలికలు చేస్తారు. పీలికలు జెండాగా ఎగరేస్తారు.
ప్రజల్ని బఫూన్‌లని చేస్తారు. పిర్రల మీద రాజముద్రలు వేస్తారు.
ఆ రాజముద్రల్లో దర్శించాలేగాని దేశ చిత్రపటం కనిపిస్తుంది.
కళ్లున్నోళ్లకి రాజ్యం దేవతా వస్త్రాలని చూపించింది కరోనా తల్లి.

బమ్మిడి జగదీశ్వరరావు

# 7 రాజువయ్యా మహరాజువయ్యా!





ఎందుకో అతనికి వొళ్లు టివటివ లాడుతోంది.

అంతకన్నా ముందు వొళ్లంతా పట్టేసినట్టుంది. పులిసినట్టుగా కూడా వుంది. ఇంకా చెప్పాలంటే యెవర్నన్నా తంతే బాగుణ్ణు అన్నట్టుగా వుంది. కనీసం యెవరితోనన్నా తన్నులు కాసినా బాగుణ్ణు అన్నట్టుగా కూడా వుంది. రెండు చేతులూ యెత్తి పట్లు విరిచాడు. వెన్ను వొంచాడు. కాళ్లూ చాపాడు. కీళ్లూ వొంచాడు. ఒళ్లు విరిచాడు.

ఊహూ...

ప్చ్!

తీరినట్టు లేదు.

"అలా వొడ్డు మీద పడ్డ చేపలా నులుసుకోకపోతే, యెక్సర సైజులు యేవో చెయ్యరాదా?"

ఊ అనలేదు. ఆ అనలేదు.

ఉనుగులు అనలేదు. జునుగులు అనలేదు.

కూర్చున్నచోట కూర్చోలేకపోయాడు. నిల్చున్నచోట నిల్చోలేక పోయాడు. కాలుగాలిన పిల్లిలా తిరిగాడు. ఆపసోపాలు పడుతున్నాడు.

"అలా నెలలు నిండిన దానిలాగ నొప్పులు పడకపోతే యేమి? యింటి పని పనికాదా? పనిల చెయ్యెట్టరాదా?"

చెవికి కాదు కదా, చెవిలోని వెంట్రుక్కీ యెక్కలేదు.

చెవిలోని గులిమికి కూడా యెక్కలేదు.

నులుసుకున్నాడు.

పిలిచి పక్కింటాయనతో గొడవ పడదామనుకున్నాడు.

వాడు వాళ్లావిడ ముందూ ఆఫీసు బాసు ముందూ నోరెత్తడని తెలిసి వూరుకున్నాడు. అలాగని వూరుకోక వుండలేక కయ్యానికి కాలు దువ్వాడు.

"వొంటికి దూలగొండాకు రాసుకున్నట్టు యెందుకు యెగ్రెక్కి పోతున్నావు, రా నాతో తగువులు పడు."

వద్దనుకున్నాడు.

మాపిటికి గెంజి వుండదనుకున్నాడు.

ఉసూరుమన్నాడు. ఈసురోమన్నాడు.

“పనిలేని మంగలోడు పిల్లిబుర్ర గొరిగినాడని నీకా పనీ లేదు, బతుకూ లేదు.”

వెతికినాడు.

పిల్లిని పట్టుకున్నాడు.

అడ్డాల్లో కూర్చోబెట్టుకొని బుదరించి రేజరుతో నున్నగ గుండు గీసినాడు.

మ్యావ్... మ్యావ్...

ఒంట్లోని సలుపు తీరలేదు.

“ఎల్లిరా రోడ్డు మీదకి వేడినీళ్లు పెడతాను, వొస్తే కాపడం పెడతాను.”

విసిగిన గొంతు విని ముఖంలోకి వెలుగొచ్చింది.

వొంట్లోకి సత్తువొచ్చింది.

ఇంట్లోంచి యెగిరి వీధిలోకి దూకాడు.

రయ్ రయ్‌మని బండేసుకు రోడ్డెక్కాడు.

లాఠీకన్నా ముందు మైకు అడ్డంపడి అడిగింది.

“ఆశీర్వాద్ ఆటా కోసం.”

ఐడీ కార్డు చూసి, ‘మీరు మూడు కిలోమీటర్లు దాటి రాకూడదు, అలాంటిది యేడు కిలోమీటర్లు దాటి వచ్చారు,’ అని గుర్తుచేసింది.

వదిలితే హైదరాబాదు నుండి విజయవాడ వెళ్లి కొనుక్కురానూ- అనుకున్నాడు.

మైకుని దాటితే మళ్లీ లాఠీ అడ్డం పడింది.

లేదు, నడ్డి కింద కడ్డీ పడినట్టు పడింది.

ఇదివరకే యెరిగిన ముఖం కాబట్టి అడగను కూడా అడగలేదు. వొడ్డించేశాడు. దోరదోరగ.

పిర్రలు పేలిపోయాయి.

పిగిలిన మామిడిపళ్లయిపోయాయి.

“ఈ యెండాకాలానికి యివే మామిడిపళ్లు, చూసి ఆనందించడమే.”

అమ్మా అన్నాడు. అబ్బా అన్నాడు.

అబజబజబ్బా అన్నాడు.

“కరోనా కాలం కదలకురా మొగుడా అంటే విన్నావా?”

కాపడం పెట్టింది.

నాల్రోజులకు నొప్పులు యెగిరిపోయాయి.

ఒంట్లో కొవ్వు కువకువలాడింది.

కథ మళ్లీ మొదటికొచ్చింది.

నొప్పులు పడ్డాడు.

అర్థం చేసుకుంది.
"ఎల్లిరా రోడ్డు మీదకి వేడినీళ్లు పెడతాను, వొస్తే కాపడం పెడతాను."
విసిగిన గొంతు విని ముఖంలోకి వెలుగొచ్చింది.
వొంట్లోకి సత్తువొచ్చింది.
ఇంట్లోంచి యెగిరి వీధిలోకి దూకాడు.
రయ్ రయ్‌మని బండేసుకు రోడ్డెక్కాడు.
లారీకన్నా ముందు మైకు అడ్డంపడి అడిగింది.
"టాటా సాల్ట్ కోసం."
"మీరున్న చోట వుప్పు కూడా దొరకలేదా?" అడిగింది.
బ్రాండ్ అన్నాడు.
బ్రాండ్ అంబాసిడర్ని- అనుకున్నాడు.
ఏదిపడితే అది వాడితే హెల్త్ ప్రాబ్లమ్స్ వస్తాయి అన్నాడు.
మైకుని దాటితే మళ్లీ లారీ అడ్డం పడింది.
లేదు, పిర్రల మీద అడ్డదిడ్డంగా పడింది.
బండి సీజయిపోయింది.
కుంటుకుంటూ యిల్లు చేరాడు.
"బండి కూడా పోయింది, మంచి పనయ్యింది."
కాపడం పెట్టింది.
దేవుడా బతుకుజీవుడా అన్నాడు.
నాల్రోజులకు నొప్పులు యిగిరిపోయాయి.
ఒంట్లో కొవ్వు రవరవలాడింది.
కథ యెక్కడ మొదలయ్యిందో మళ్లీ అక్కడికే వచ్చి ఆగింది.
నొప్పులు పడ్డాడు.
అర్థం చేసుకుంది.
"ఎల్లిరా రోడ్డు మీదకి వేడినీళ్లు పెడతాను, వొస్తే కాపడం పెడతాను."
విసిగిన గొంతు విని ముఖంలోకి వెలుగొచ్చింది.
వొంట్లోకి సత్తువొచ్చింది.
ఇంట్లోంచి యెగిరి వీధిలోకి దూకాడు.
కుంటుకుంటూ రోడ్డెక్కాడు. కాళ్లకి చక్రాలు మొలిశాయి.
లారీకన్నా ముందు మైకు అడ్డంపడి అడిగింది.
"పేరాచూట్ కొబ్బరినూనె కోసం."

'మీరున్న యేరియాలో నూనె కూడా దొరకలేదు, బ్రాండు వాడకపోతే జుట్టూడిపోతుంది,' అన్నది.

యా అన్నాడు. యా యా అన్నాడు.

గాటిట్ అని కూడా అన్నాడు.

మైకుని దాటితే మళ్లీ లాఠీ తన పని తాను చేసుకుపోయింది.

పిర్రలు పళ్లు కాదు పుళ్లు అయిపోయాయి.

దేక్కుంటూ యిల్లు చేరాడు. విరిగిన చక్రాల బండిలాగ చేరాడు.

"ఇప్పటికే వాట్సప్ వీడియోల్లో వైరల్ అయిపోయారు యికనైనా ఆపుదురు."

కాపడం పెట్టే వీలు లేక ఆయింట్‌మెంటు రాసింది.

పుళ్లు తొక్కుగట్టాయి.

ఏ మూలో దాగిన కొవ్వు కండ గట్టింది.

కథ ముగియక ముందే మొదలయ్యింది.

నులుసుకున్నాడు.

నొప్పులు పడ్డాడు.

అర్థం చేసుకుంది.

"ఎల్లిరా రోడ్డు మీదకి వేడినీళ్లు పెడతాను, వొస్తే కాపడం పెడతాను."

అవసరం లేదన్నాడు.

అగత్యం రాదన్నాడు.

రాజులా కదిలాడు. మహారాజులా కదిలాడు.

ఇంట్లోంచి యెగిరి వీధిలోకి దూకాడు.

రయ్‌మని రోడ్డెక్కాడు.

రాజు వెడలె రవి తేజములలరగ...

లాఠీకన్నా ముందు మైకు అడ్డం పడి అడిగింది.

"మందు కోసం."

'మీరు రెడ్ జోన్లో వున్నారు,' అన్నది.

మాకన్నీ గ్రీన్ జోన్లే అన్నాడు.

ఎవ్వర్ గ్రీన్- అనుకున్నాడు.

మైకుని దాటితే మళ్లీ లాఠీ తనపని తాను చేసుకోలేకపోయింది.

"వైన్ కోసం."

కనిపించిన మూడు సింహాలతో పాటు కనిపించని నాల్గో సింహం కూడా సెల్యూట్ చేసింది. రాజముద్ర వేసింది.

స్వాగతం పలికి దారిచ్చింది.

ఒంటరితనం పోయి గుంపయిపోయాడు.

మంది మీద పడ్డాడు. మందిలో కలిసాడు. రాసుకున్నాడు. పూసుకున్నాడు. వేసుకున్నాడు.

ఊక్కుంటూ వూసుకుంటూ యిల్లు చేరాడు.

వేడినీళ్లని కాలితో తన్నాడు. ఆయింట్‌మెంటుని అవతలికి విసిరేసాడు.

"నాకేం నొప్పుల్లేవ్ లేవ్ లేవ్."

అడ్డు తప్పుకుంది ఆమె.

ఆనందంగా ఫేంటు విప్పి చూపించాడు.

కళ్లు పులుముకు చూసింది.

ఆశ్చర్యం.

పిర్రల మీద దేశ చిత్రపటం!

ఆమె చేతులు జోడించి నమస్కరించింది!!

*సారంగ అంతర్జాల పక్షపత్రిక*
*1 జూన్ 2020*

✻



**బమ్మిడి జగదీశ్వరరావు** 7 జనవరి 1969న శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జన్మించారు. మొదటి కథ అసలైన దైవభక్తి 1985 అక్టోబర్‌లో బాల రంజనిలో అచ్చయ్యింది. నాలుగొందలకు పైగా కథలు, జానపద కథలు, పిల్లల కథలు రాశారు. ఆరు కథాసంపుటాలు- రెక్కలగూడు, *పిండొడిం, దేవుళ్లూ దయ్యాలూ మనుషులూ, మట్టితీగలు,* హింసపాదు, *రణస్థలి* ప్రచురించారు. వివిధ పత్రికల్లో కాలమ్స్ రాశారు. కొన్ని అనువాదాలు చేశారు. కొన్ని సినిమాలకు మాటలు రాశారు. 1998 నుండి హైదరాబాద్‌లో నివాసం.

***ఫోన్: 94906 96911*** **bajara.bammidi@gmail.com**